## క్లుప్తంగా

### మహానందిలో తగ్గని భక్తుల రద్దీ



మహానంది: మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ తగ్గడం లేదు. వరుసగా రెండు రోజుల పాటు సెలవులు, సోమవారం ఏకాదశి కలిసి రావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి వేలాది సంఖ్యలో భక్తులు మహానందికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మ వారికి మహా రుద్రాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. ఆర్జిత సేవల ద్వారా భక్తులు అభిషేకం , కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు.

### ఆలయ భూముల వేలంలో భారీ ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని పెద్దదేవలాపురం, నారాయణపురం గ్రామాల్లోని దేవస్థానం భూములకు ఏడాది పాటు కౌలుకు సోమవారం వేలం పాట నిర్వహించినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. పెద్దదేవలాపురంలో రూ.17,29,300 ఆదాయం లభించిందన్నారు. గత ఏడాది కన్నా ఈ సంవత్సరం రూ. 4,94,100 అధికంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అలాగే నారాయణపురంలో రూ.5,04 600 వచ్చిందని గత సంవత్సరం కన్నా రూ. 18,100 అధిక ఆదాయం లభించిందన్నారు.

### నిత్యాన్నదాన సంస్థకు రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత తుమ్మలశెట్టి రామకృష్ణ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో నిర్వహిస్తున్న రైతు అన్నదాన సత్రానికి అనంతపురం పట్టణానికి చెందిన తుమ్మశెట్టి రామకృష్ణ కుటుంబ సభ్యులు రూ.లక్ష నగదును విరాళాన్ని అందించినట్లు రైతు అన్నదాన సంస్థ సెక్రటరీ బండి యాగంటి రెడ్డి సోవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు అన్నదాన సంస్థకు భక్తులు విరాళం అందించి తోడ్పాటునందించాలని కోరారు. దాత రామకృష్ణను సంస్థ తరపున సత్కరించారు.

### ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సెలవు రోజు కావడంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు ఆలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

### రేపు మాన్యం కౌలుకు వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేట ఆంజనేయ కోదండరామస్వామి దేవస్థానం, మూలసాగరంలోని శ్రీరామస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి, భీమలింగేశ్వరస్వామి దేవస్థానం భూముల వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రామాంజనేయశర్మ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 19వ తేదీ ఉదయం 10గంటలకు బయటి పేట ఆంజనేయస్వామి, కోదండరామస్వామి దేవస్థానంలో ఉదయం 10గంటలకు వేలం నిర్వహిస్తారని, అదే రోజు సాయంత్రం 4గంటలకు మూలసాగరంలో వెలసిన శ్రీరామస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కూడా వేలం ఉంటుందని చెప్పారు. 20వ తేదీన మూలమఠం శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానం భూములు మూడు సంవత్సరాల కాలపరిమితికి కౌలుకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. వేలం ముగిసిన వెంటనే పాటదారుడు మొత్తం డబ్బులు చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్: బక్రీద్ పర్వదినాన్ని నియోజకవర్గంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి ముస్లింలు ఈద్గాలకు చేరుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మత పెద్దలు దైవ సందేశాన్ని శ్రద్ధగా విన్నారు. నందికొట్కూర్ బస్టాండ్ సమీపంలో ఉన్న ఈద్గా, పెద్ద ఈద్గాతో పాటు మండల పరిధిలోని బొల్లవరం, దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. మత పెద్దలు ముస్లింల సంక్షేమానికి దువా చేశారు. హజ్ యాత్రికులు యాత్రను ముగించుకొని క్షేమంగా తమ స్వస్థలాలకు చేరుకోవాలని ప్రార్థించారు. అనంతరం పలువురు ముస్లింలు పొట్టేళ్ల మాంసాన్ని(ఖుర్బానీ) కానుకగా బంధుమిత్రులకు, పేదలకు పంచిపెట్టారు.

**పగిడ్యాల మండలంలో..**

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, బీరవోలు, లక్ష్మాపురం, ప్రాతకోట, ఎన్.ఘణపురం తదితర గ్రామాల్లోని ముస్లింలు బక్రీద్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే పవిత్ర స్నానాలు ఆచరించి గ్రామ శివారుల్లోని ఈద్గాల వద్ద ఐకమత్యంతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అల్లా ఆజ్ఞ మేరకు ఇబ్రహీం ప్రవక్త తన ఏకైక కుమారుడైన ఇస్మాయేలును బలి(ఖుర్బానీ) ఇవ్వడానికి వెనుకాడలేదని మోలీసా రహిమాన్ తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీ ద్ ముస్లింలకు పవిత్రమైనదన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

**మిడుతూరు మండలంలో..**

మిడుతూరు: మిడుతూరుతోపాటు కడుమూరు, దేవనూరు, తలముడిపి, కలమందలపాడు, తిమ్మాపురం, చౌట్కూరు తదితర గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు.

**జూపాడుబంగ్లా మండలంలో..**

జూపాడుబంగ్లా: బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని తాటిపాడు, తర్తూరు, మండ్లెం, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తరిగోపుల, పారుమంచాల, తూడిచెర్ల, తదితర గ్రామాల్లోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లిం మత గురువులు బక్రీద్ పండుగ ప్రాధాన్యతను వివరించారు.

ఆత్మకూరు: బక్రీద్‌ను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆయా ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు.

**త్యాగనిరతికి నిదర్శనం బక్రీద్**

వెలుగోడు: పట్టణంలో ముస్లింలు సోమవారం ఉదయం ఊరేగింపుగా మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముతవల్లీల ప్రార్థనల అనంతరం ధార్మికోపన్యాసం చేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకుంటున్నామన్నారు. త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని పేర్కొన్నారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా పండుగ జరుపుకోవడమే బక్రీద్ ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ దాన గుణం, సేవాగుణం అలవర్చుకోవాలని చెప్పారు. పండుగ సందర్భంగా ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపి బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు.



ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



బ్రాహ్మణకొట్కూరు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెలుగోడులో..



బక్రీదు పండుగ విశిష్టత వివరిస్తున్న మత గురువు సుభాన్

**పాములపాడు మండలంలో..**

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం బక్రీదు పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈద్గాల వద్ద ఆయా గ్రామాల్లోని మత గురువులు బక్రీదు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ సోదరభావంతో, శాంతియుతంగా మెలగాలని దువా చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖుర్బాణీ చేశారు.



ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

**కొత్తపల్లి మండలంలో..**

కొత్తపల్లి: మండలంలోని ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దుద్యాల, నందికుంట, కొత్తపల్లి, శివపురం, ముసలిమడుగు, ఎదురుపాడు, కొక్కెరంచ గ్రామాల్లోని మసీద్, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. మతపెద్దలతో అల్లాహ్ ప్రవచనాలు చేసుకొన్నారు. ఒకరినొకరు ఆలింగనాలు చేసుకొంటూ భక్తితో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



శివపురం సమీపంలోని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదుల్లో ముతవల్లీల ప్రత్యేక ప్రార్థనల అనంతరం ధార్మిక ఉపన్యాసం చేశారు. త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని పేర్కొన్నారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లింలు పండుగ జరుపుకుంటున్నట్లు తెలిపారు.



బండి ఆత్మకూరులో..

## రమణీయం.. మహానందీశ్వరుని పల్లకోత్సవం



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుదీర్చారు. బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో స్వామివార్ల పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారి పల్లకీని మోస్తూ భక్తిని చాటుకున్నారు.

## ఉమామహేశ్వర స్వామికి పల్లకీసేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వర స్వామివారికి పల్లకీ సేవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం అర్చన తదితర పూజలు జరిగాయి. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వర రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యాగంటి ఉమామహేశ్వర స్వామివారిని పల్లకీలో ఉంచి ఊరేగిస్తున్న దృశ్యం

## రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామంటూ నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. సోమవారం స్థానిక సచివాలయం-2 వద్ద రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పినట్లుగా ఏడాదికి రైతులకు రూ.20 వేల నగదు పెట్టుబడి సాయంగా అందజేస్తామన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే కర్నూలు-కడప కాల్వకు రెండు కార్ల పంటకు నీటిని ఇచ్చి ఆయకట్టు రైతులను ఆదుకుంటామన్నారు. అనంతరం రైతులకు రాయితీపై జీలుగ, కంది విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏఓ కృష్ణారెడ్డి, సర్పంచ్ మొట్టె బాలస్వామి, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

## నిజాయితీ చాటుకున్న ఏజెన్సీ ఉద్యోగి

మహానంది: మిత్రులతో కలిసి మహానందికి స్వామివారి దర్శనార్థం వచ్చిన వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన గంగా శివప్రసాద్ తన మొబైల్‌ను పెద్ద నంది విగ్రహం వద్ద మరిచిపోయాడు. బోయలకుంట్ల వరకు వెళ్లిన గంగా శివప్రసాద్ వెంటనే సమాచార కేంద్రానికి చేరుకుని ఉద్యోగి లక్ష్మయ్యకు విషయం తెలిపాడు. నంది వద్ద విధులు నిర్వహించే ఏజెన్సీ ఉద్యోగి రమేశ్ మొబైల్ గుర్తించి బాధితుడికి అప్పగించాడు. అతని నిజాయితీని అందరూ మెచ్చుకున్నారు.

## నేడు డైల్ యువర్ డీఎం

నందికొట్కూరు: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి డైల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తునట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం డిపోలో ఆయన మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు డైల్ యువర్ కార్యక్రమం ఉంటుందన్నారు. 99592 25799 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలపై ఫిర్యాదు చేయాలని, ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

## నివాళి

పాములపాడు: మాజీ ఎంపీపీ జీఎం లక్ష్మీదేవమ్మ మృతదేహానికి సోమవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పూలమాల వేసి నివాళ్లులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మృతురాలి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కూడా పరామర్శించారు.

## ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన రాజాబాబు మరో నాలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. ఇదే గ్రామానికి చెందిన నాగమద్దిలేటి అనే వ్యక్తిని కులం పేరుతో దూషించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఘర్షణ..కేసు నమోదు

చాగలమర్రి: ఆర్థికలావాదేవీల విషయమై దాడి చేయడంతో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. మండలంలోని డి.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఏర్వ అరుణ అనే మహిళకు అదే గ్రామానికి చెందిన ఏర్వ శివ కోనిరెడ్డి మధ్య డబ్బుల విషయంలో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే శివ కోనిరెడ్డి తనను అసభ్య పదజాలంతో దూషించాడని, అడ్డు వచ్చిన తన భర్త రాజగోపాల్ రెడ్డి, బంధువైన రవికుమార్‌రెడ్డిపై దాడి చేశాడని అరుణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏర్వ శివ కోనిరెడ్డిపై సోమవారం కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## నేడు మాన్యం కౌలుకు వేలం

ఉయ్యాలవాడ : స్థానిక అగస్తీశ్వర స్వామి, కోదండ రామస్వామి, ఆలయ భూములు ఏడాది కాల వ్యవధి కౌలు సాగు కోసం మంగళవారం అగస్తీశ్వర ఆలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయా ఆలయాలకు చెందిన 51 ఎకరాలకు నిర్వహించే వేలంలో పాల్గొనే రైతులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. భూములు దక్కించుకున్న హెచ్చు పాటదారుడు పాట పూర్తయిన వెంటనే పూర్తి కౌలు మొత్తం చెల్లించి రశీదులు పొందాలని చెప్పారు.

## అదనపు కట్నం కోసం వేధింపులు.. ముగ్గురిపై కేసు నమోదు

రుద్రవరం: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మండలంలోని పెద్దకంబలూరుకు చెందిన భవాని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. భవానికి మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా బెస్తవారి పేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుపతితో పెద్దలు వివాహం జరిపించారు. పెళ్లి అయిన కొద్ది రోజుల నుంచి భర్తతో పాటు అత్త కోటమ్మ, మామ నారాయణ ముగ్గురు అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించేవారు. అయినప్పటికీ ఆమె సర్దుకొని పోయేది. గత కొద్ది రోజుల నుంచి వేధింపులు అధికం కావడంతో భరించలేక పుట్టింటికి వచ్చేసింది. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

## బస్సు దిగుతూ కింద పడి వ్యక్తికి గాయాలు

- చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలింపు

చాగలమర్రి: బస్సు దిగుతూ ప్రమాదవశాత్తూ కింద పడి వ్యక్తి గాయాలపాలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. కండక్టర్ రాణి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కేరళ ఆసుపత్రి సమీపంలోని రిక్వెస్ట్ స్టాప్ వద్ద ప్రొద్దుటూరు నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న ఏపీ 39 యూజీ 7340 అను నంబరు గల బస్సు నుంచి దిగబోయి ప్రమాదవశాత్తు జారి కిందపడి గొడిగనూరు గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ప్రథమ చికిత్స నిమిత్తం కేరళ ఆసుపత్రికి తరలించారు. రిక్వెస్ట్ స్టాప్ వద్ద నవీన్‌కుమార్ తనకు సంబంధించిన వ్యక్తులతో పాటు బస్సు ఎక్కాడు. వారిని బస్సు ఎక్కించి ఆయన కిందకు దిగేందుకు ప్రయత్నిస్తుండగా.. బస్సు ఆపుతామని చెప్పినా పట్టించుకోకుండా కిందకు దూకాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడిని మెరుగైన చికిత్స కోసం కడప పట్టణంలో రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బస్సు

## బంగారు వర్ణంలో భానుడు

సూర్యాస్త సమయంలో ఆకాశంలో అద్భుతాలకు కొదవే ఉండదు. వర్షాకాలంలో ఇలాంటి దృశ్యాలు మరింత అధికం. సోమవారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఆకాశం బంగారు వర్ణంలో కాంతులు వెదజల్లడంతో పట్టణ పరిసరాలు ఒక్కసారిగా పుత్తడి వర్ణంలో మెరిసిపోయాయి. ముఖ్యంగా రైల్వే స్టేషన్ పరిసరాలు కొత్తందాలను సంతరించుకున్నాయి. కర్నూలు,నంద్యాల రైల్వే గేట్ల మధ్య సూరీడు అందాలు మంత్ర ముగ్ధులను చేశాయి. సూర్యుడు మెల్లగా జారుకుంటుండగా ఆకాశం పసిడి కాంతులతో వెలుగులీనిన దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. -డోన్ టౌన్





పసుపు సాగు కోసం సాల్లు తీస్తున్న రైతన్నలు



పొలంలో పసుపు విత్తనం వేస్తున్న మహిళలు



విత్తేందుకు మంచి పసుపును సేకరిస్తున్న మహిళలు

## నేల తల్లికి 'పసుపు' పారాణి!

మహానంది: వరుణుడు కరుణించడంతో కొద్ది రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతన్నలు వివిధ పంటలు సాగుచేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మహానంది మండలంలో సాగు చేస్తున్న ప్రధాన పంటల్లో అరటి, వరి తర్వాత స్థానం పసుపు పంటదే. అందులో భాగంగా తిమ్మాపురం, బుక్కాపురం, గాజులపల్లె, గోపవరం తదితర గ్రామాల పరిధిలోని రైతులు పసుపు సాగు కోసం విత్తనం పసుపును మైదుకూరు, దిగువ మెట్ట ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుని తీసుకొచ్చి విత్తు వేసే పనిలో నిమగ్నమయ్యారు. సోమవారం పంట పొలాల్లో కనిపించిన దృశ్యాలను సాక్షి కెమెరాలో బంధించింది.



పసుపును శుద్ధి చేస్తున్న రైతు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com